# క్రియాసిద్ధిః సత్వే భవతి మహతాం నోపకరణే

రచన : **పం. రాఘవేంద్రాచార్య రాచూరి,** బెంగళూరు.

ఈ ఆధునిక యుగములో మానవుడు ఎంతో ప్రగతిని సాధించాడు. ఈనాటికీ తనకున్న తెలివినంతా గుమ్మరించి సుఖమయజీవితానికి సోపానాలను వేస్తున్నాడు. అన్ని రంగాలలో దినే దినే క్రొత్త క్రొత్త పరిశోధనలతో, ఆవిష్కరణలతో మానవజీవితమును పూలబాటగా చేయు యత్నమును చేస్తున్నాడు. దీని ఫలితముగా ఎన్నోదినములు ఎండవానలను, కష్టనష్టాలను సహించి, కాలినడకతో శ్రమించిచేయు బదరీయాత్రనో, కాశీయాత్రనో ఏ ఆయాసము లేకనే కేవలము కొన్ని గంటలలోనే విమానములో చేయగలుగుచున్నాడు. టీ.వి, కంప్యూటర్, సెల్ ఫోన్ మొదలైన ఎన్నో పరికరాలను సృజించి ప్రపంచాన్నే చిన్నదిగా చేయగలిగాడు. ఇటువంటి ఎన్నో సౌకర్యాలు మానవుని ప్రగతికి అద్దం పడుచున్నవి.

ఐతే ప్రజ్వలిస్తున్న ఈ మానవుని ప్రగతికి కారుమబ్బుల భయం లేకపోలేదు. ఇతిమితిలేక విచక్షణారహితుడై ప్రకృతిని కేవలము తన స్వార్థం కోసం దుర్వినియోగం చేయు మానవునికి ఆ ప్రకృతియే ఒకనాడు తగిన పాఠం నేర్పుతుంది. ఇరవై ఏళ్ళ క్రిందట జరిగిన చర్నోబిల్ దురంతమే దీనికి సుస్పష్టమైన నిదర్శనము. ప్రగతి పేరున మానవుడు తను తీసిన గోతిలో తనే పడుతున్నాడంటే అది అతిశయోక్తి కాదు.

నేటి ఈ దుఃస్థితికి మానవుని అజ్ఞానమే కారణము. ప్రాచీన ఋషిమునుల అనుభవాలను, ఉపదేశాలను నిర్లక్షించి పవిత్రమైన జ్ఞానానికి దూరమైనందుకు ఈనాడు మానవాళి కష్టాల పాలౌచున్నది. క్షుల్లకమైన ఐహిక సుఖం కోసం ప్రపంచమునే నాశనము చేయుచున్నది.

మన పూర్వజులు ప్రకృతినుంచి అతిగా ఆశించలేదు. త్యాగమే వారి ఊపిరి. అల్పసాధనములతోనే సిద్ధిని పొందే కార్యవైఖరి. వైచారికతలో వారికి వారే సరి. వారి విచారధారను, వ్యక్తిత్వమును ఒక కవి తన మాటలలో ఇలా ప్రతిబింబించాడు -

**రథస్యైకం చక్రం భుజగయమితాః సప్తతురగాః ।**
**నిరాలంబో మార్గశ్చరణరహితః సారథిరపి ।।**
**రవిర్గచ్ఛత్యంతం ప్రతిదినమపారస్య నభసః ।**
**క్రియాసిద్ధిస్సత్వే భవతి మహతాం నోపకరణే ।।**

రథమునకు ఒక్క **చక్రం.** పామే కళ్ళెము. తలొక దిక్కునకు లాగే ఏడు గుఱ్ఱాలు. ఆధారం లేని ఆకాశపు మార్గము. కాళ్ళు లేని సారథి. ఒక్కటా రెండా అన్నీ అడ్డంకులే. ఐనప్పటికీ సూర్యుడు తన ప్రయాణమును ప్రతిదినమూ కొనసాగిస్తూనే ఉన్నాడు. మహాత్ములకు సాధనములున్ననేమి లేకున్ననేమి. స్వశక్తియే వారి బలము. కేవలము స్వశక్తితోనే వారు కార్యసిద్ధిని పొందెదరు. అందుచేతనే వారిని మహాత్ములందురు.

శ్రీ సత్యధ్యానతీర్థులు సంచారముచేయుచూ ఒక గ్రామమునకు విచ్చేసిరి. వేసవి కాలము కావుటవలన అందరికీ ఎక్కడలేని దాహము. సత్యధ్యానులవారు శ్రీమఠముయొక్క భక్తులందరి దప్పిక తీర్చుటకు చల్లటి పానకము చేయించుటకు నిశ్చయించిరి. ఐతే ఆ గ్రామములో వచ్చినవారందరికీ పానకము చేయుటకు సరిపడు భాండము లభ్యము కాలేదు. పానకము చేయుటకు వీలుకాదని వ్యవస్థాపకులు విన్నవించుకొనిరి. భాండము లేకున్ననేమి శ్రీమఠపు బావిలోనే పానకము చేయించి భక్తుల దప్పికను తీర్చిరి సత్యధ్యానులు.

ఇటువంటి మహాత్ములే మానవాళికి దారిదీపాలు. వారి అడుగు జాడలలో నడచిన జగత్తుకు తప్పక కల్యాణము కలుగును. మానవుని అధ్యాత్మసాధనకై దేవునిచే సృజింపబడిన ఈ జగత్తు మానవుని వికృత విలాసముల భూమి కాకూడదు. త్యాగబుద్ధితో ప్రకృతిచే స్వాభావికముగా అందింపబడినదానితో

తృప్తిచెంది, అపరాధీనుడై, స్వశక్తితో అధ్యాత్మసాధనను చేయుటయందే మానవునికి శ్రేయస్సు కలదు. ఇదే మహాత్ములు మానవాళికిచ్చు సందేశము.